BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ । ఆదివారం । 21 జూలై । 2024 www.balagamtv.com పేజీలు 3


# బలగం టీవీ ఎప్పుడూ ప్రజల పక్షమే

బలగం టీవీ ప్రేక్షకులకు, పాఠకులకు నమస్కారం..
నేను మీ బాలు కాయితి సిరిసిల్ల.

గత 21 సంవత్సరాలుగా.. సిరిసిల్ల కేంద్రంగా వివిధ దినపత్రికల్లో గ్రామీణ విలేకరిగా జీవితాన్ని ప్రారంభించి.. జర్నలిస్టుగా ప్రజా సమస్యలపై.. ఎప్పటికప్పుడు స్పందిస్తూ.. వార్తాల రూపకంగా ప్రభుత్వానికి నివేదిస్తూ వస్తున్న. సోషల్ మీడియా మిత్రుల సహాకారంతో.. మద్దతులో సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటూ వచ్చాను. నా వంతుగా ఈ సమాజానికి ఏమో చేయాలని, పేద ప్రజల గొంతుకగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ప్రజల సమస్యలు వెలికితీయడం, ప్రభుత్వానికి కొన్ని సందర్బాల్లో ప్రశ్నలు సంధిస్తున్న సమయంలో అనేక అటుపోట్లను కూడా ఎదుర్కోన్నాను. రాజకీయ నాయకుల బెదిరింపులకు కూడా గురయ్యాను. నాపై సోషల్ మీడియాలో బుదరజల్లే ప్రయత్నం చేసినా నన్ను అభిమానించే వారంత నాకు మద్దతు పలికి నాకు ఇన్నాళ్లు సపోర్టు చేస్తూ వస్తున్నారు. మీ ప్రోత్సహంతో, మీ మద్దతులో బలగం టీవీ డిజిటల్ ప్లాట్ ఫాంను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలనే ఉద్దేశ్యంతో.. నెట్‌వర్క్‌ను విస్తరించాలని నిర్ణయించాను. ఇక నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు హైదరాబాద్ కేంద్రంగా మన బలగం టీవి, బలగం టీవీ ఎంటర్‌టైన్మెంట్, బలగం టీవి వెబ్ సైట్, డిజిటల్ ఈ పేపర్ ను కూడా ప్రేక్షకులకు, పాఠకులు అందించాలని సంకల్పించాను. బలగం టీవి ఎప్పుడు ప్రజల పక్షానే గొంతు విప్పడానికి, కళలు, కళాకారులను కాపాడుకోవడానికి ఎప్పుడు ముందుంటుంది. ముఖ్యంగ గల్ఫ్ సమస్యలు, వారి సంక్షేమం కోసం ఈ బలగం టివి పాటుపడుతుంది. నాకున్న అతి తక్కువ వనరుల్లో.. ప్రస్తుతం చిన్నగా ఈ బలగం టీవీ ప్రారంభిస్తున్నప్పటికీ.. భౌవిష్యత్తులో ప్రజల భాగస్వామ్యంతో ఈ మన బలగం టీవీ సమాచారం సంస్థను, వ్యవస్థను దశలవారిగా విస్తరించాలనుకుంటున్నాను. మీ అందరి ఆశీర్వాదాలు నాపై ఉంటే. ఒక్కటే నిర్ణయించుకున్న.. కష్టమైన, నష్టమైనా మనం ప్రజల పక్షాన ఉంటేనే విలువ.. వారి సమస్యలను ఎప్పటికప్పుడు వెలికితీసి.. వాటి పరిష్కార దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం బలగం టీవీ చేస్తుంది. బలగం టీవీ విస్తరించడానికి, డిజిటల్ ప్లాట్ ఫాంను ఏర్పాటు చేయడానికి సహకరిస్తున్న నా మిత్రబృందానికి, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు.



# తెలంగాణలో కుండపోత వర్షాలు

- ఎడతెరిపి లేకుండా వాన
- పొంగిపొర్లిన వాగులు వంకలు
- బయటకెళ్లేందుకు ప్రజల ఇబ్బందులు
- ఆరు జిల్లాలో దంచికొట్టిన వాన
- అత్యధికంగా ములుగు జిల్లాలో వాన





**బలగంటీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలోని ఆరు జిల్లాలో కుండపోత వర్షాలు కురిశాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం పెద్దంపేటలో కుంభవృష్టి వాన పడింది. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు అక్కడ 20.7 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలలం దేవులవాడలో 17.2సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ రెండు జిల్లాలతోపాటు కుమురం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్ జిల్లాలో బీభత్సమైన వర్షం కురిసింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల వాగులూ వంకలు పొంగిపొర్లుతున్నాయి. కాలనీలు జలమయమయ్యాయి.

చిలికా సరస్సు సమీపంలో ఒడిశా తీరంలోని అల్పపీడనం కొనసాగుతుందని.. పూరికి 40 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని తెలిపింది. వాయువ్య దిశగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కదులుతూ 12గంటల్లో క్రమంగా బలహీనపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు ఆసిఫాబాద్, మంచి ర్యాల, జగిత్యాల, భూపా లపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబాబాద్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. దాంతో ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గడిచిన 24గంటల్లో కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల జోగులాంబ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ములుగు జిల్లాలో వెంకట పురంలో అత్యధికంగా పది సెంటీమీటర్లకుపైగా వర్షాపాతం నమోదైంది.

## జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

**సీఎస్ శాంతి కుమారి**



భారీ వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎస్ శాంతి కుమారి అన్నారు. ఉత్తర తెలంగాణలోని 11 జిల్లాలలో ఈనెల 20, 21 తేదీలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఆయాజిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎస్ ఆదేశించారు.



## మరోసారి నిపా వైరస్ కలకలం

**బలగంటీవీ, తిరువనంతపురం**

కేరళలో నిపా వైరస్ మరోసారి కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని మలప్పురం జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలుడికి వైరస్ సోకినట్లు తేలింది. ఈ క్రమంలో కేరళ ప్రభుత్వం హై అలెర్ట్ ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ సదరు బాలుడికి నిపా వైరస్ సోకినట్లుగా నిర్ధారించిందని ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ ప్రకటించారు. ప్రస్తుతం బాలుడు ప్రైవేటు ఆసుప్రతిలో వెంటిలెటర్‌పై చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. బాలుడిని త్వరలోనే కోజికోడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బాలుడి కాంటాక్టులను ట్రేస్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. హై రిస్క్ కాంటాక్టులను విభజించి.. నమూనాలను పరీక్షల కోసం పంపినట్లు పేర్కొన్నారు. ముందుజాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# నిరుద్యోగ సమస్య పరిష్కారమే మొదటి ప్రాధాన్యత

- అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటన
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం ప్రారంభం



**బలగంటీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలన్నదే ప్రజా ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఏ నిరుద్యోగ సమస్య అయితే తెలంగాణ ఆకాంక్షకు బలమైన కారణమైందో ఆ సమస్యను పరిష్కరించే దిశగా అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన జాబ్ క్యాలండర్‌ను ప్రకటించబోతున్నామని చెప్పారు. ప్రతి ఏటా మార్చి 31 లోగా అన్ని శాఖల్లో ఏర్పడిన ఖాళీలను తెప్పించి జూన్ 2 నాటికి నోటిఫికేషన్ ఇచ్చి డిసెంబర్ 9 లోపు నియామక పత్రాలను ఎంపికైన అభ్యర్థుల చేతుల్లో పెట్టాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని సీఎం చెప్పారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఇతర మంత్రివర్గ సహచరులతో కలిసి ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన "రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం" కార్యక్రమాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. సింగరేణి సంస్థ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో సివిల్స్‌లో ప్రిలిమ్స్ సాధించి మెయిన్స్‌కు ఎంపికైన యువతీ యువకులకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తారు. "నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తుందని ముందు ప్రభుత్వంపై విశ్వాసం, నమ్మకం ఉండాలి. ఈ ప్రభుత్వం కచ్చితంగా, సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించి సమర్థులైన వారిని ఎంపిక చేస్తుందన్న నమ్మకం రావాలి. ఎంపికలోనూ కచ్చితంగా సామాజిక న్యాయం పాటిస్తుంది. ఎస్సీ, ఎస్టీ ఓబీసీ, మహిళా రిజర్వేషన్లు పాటిస్తుంది. ఎలాంటి అపనమ్మకాలు అవసరం లేదన్న భావన రావాలి. సంస్థపై నమ్మకం ఉంటే నిరుద్యోగుల ఫోకస్ అంతా ప్రిపరేషన్‌పై ఉంటుంది" అని ముఖ్యమంత్రి వివరించారు.

గ్రూప్ 1,2,3 ప్యారా మెడికల్, పోలీస్, డీఎస్సీ, టెట్... ఇలా ఏ పరీక్షలైనా సరైన సమయంలో సమర్థవంతంగా నిర్వహించాలన్నదే ప్రభుత్వ ప్రాధాన్యత అని సీఎం చెప్పారు. కష్టపడే విద్యార్థులకు ఈ ప్రభుత్వం భుజం తడుతుందని భరోసానిచ్చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లోనే చిత్తశుద్ధితో 30 వేల ఖాళీలను భర్తీ చేసి నియామక పత్రాలను అందజేసిన విషయాన్ని గుర్తుచేస్తూ దాన్ని బట్టి ప్రభుత్వ ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చని తెలిపారు.

నాడు తెలంగాణ అంటే నిరుద్యోగానికి పర్యాయపదంగా ఉండేదని, తెలంగాణ ఏర్పడినప్పుడు 20, 22 ఏండ్ల వయసున్న యువకులు ఉద్యోగం కోసం గత పదేండ్లలో ఎన్నో ఆశలు పెట్టుకుంటే ఆనాడు జరిగిన అనేక పొరపాట్ల వల్ల ఏ పరీక్షా సమయానికి జరక్క, పరీక్షా పత్రాలు లీకయి పల్లి బఠాణీల్లా మార్కెట్‌లో దొరకడం వంటి అనేక పరిణామాల వల్ల వారిలో నమ్మకం సన్నగిల్లడమే కాకుండా వారి జీవితంలో పదేళ్ల విలువైన కాలం వృధా అయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

తెలంగాణ నుంచి యూపీఎస్సీ 2024 లో విజయం సాధించిన అభ్యర్థులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జ్ఞాపికను అందజేసి అభినందించారు.

# నిరుద్యోగులపై ప్రభుత్వం కక్ష కట్టింది

- పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు
- సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్
- గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేత



**బలగంటీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ నిరుద్యోగులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్ష కట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశంపై రాజ్‌భవన్‌లో గవర్నర్ రాధాకృష్ణన్‌కు కేటీఆర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రంలో రాజ్యాంగం మీద జరుగుతున్న దాడిని వివరించి చెప్పేందుకు కేసీఆర్ ఆదేశాల మేరకు గవర్నర్‌ను కలిశామని తెలిపారు. రెండు ముఖ్యమైన అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ నేతలు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను గవర్నర్‌కు తెలియజేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కుతూ.. అప్రజాస్వామికంగా విద్యార్థులపై దాడులు చేసి కేసు పెడుతున్నట్లు చెప్పాం. విద్యార్థులపై లాఠీలు ఝులిపిస్తూ.. భయానక వాతావరణం సృష్టించారని.. తెలంగాణ ఉద్యమ సమయంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను యూనివర్సిటీల్లో చూస్తున్నామని తెలిపారు.

"మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. జాబ్ క్యాలెండర్ అని చెప్పి ప్రకటనలు ఇచ్చారని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం. కేసీఆర్ హయాంలో జారీ అయిన గ్రూప్-1, 2, 3 నోటిఫికేషన్లు రద్దు చేసి పోస్టుల సంఖ్య పెంచుతామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని గుర్తు చేశామన్నారు. ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని గవర్నర్‌కు చెప్పామని కేటీఆర్ తెలిపారు. మెగా డీఎస్సీ అని చెప్పారు కానీ వేయలేదు. నిరుద్యోగ భృతి 4 వేలు ఇవ్వలేదు. అన్నింటికి మించి సిటీ సెంట్రల్ లైబ్రరీలో చదువుకుంటున్న విద్యార్థులను బయటకు ఈడ్చుకొచ్చి హింసించారు. ఉస్మానియా యూనివర్సిటీలో హాస్టల్ ఉన్న విద్యార్థులపై దాడులు చేసి అప్రజస్వామికంగా వ్యవహరించారని వివరించి చెప్పాం. హోం సెక్రటరీని పిలుచుకుని అడుగుతానని, విద్యార్థులపై దాడులు చేయడం సరికాదని గవర్నర్ అన్నారు" కేటీఆర్ చెప్పారు.

ఇక ఈ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎమ్మెల్సీలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో న్యాయం పోరాటం చేస్తున్న విషయాన్ని, స్పీకర్‌ను కలిసి అభ్యర్థించిన విషయాన్ని గవర్నర్‌కు తెలియజేశాం. ఖైరతాబాద్ ఎమ్మెల్యే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ మీద గెలిచి.. కాంగ్రెస్ టికెట్‌పై పార్లమెంట్‌కు పోటీ చేశారు. ఈ పార్టీ ఫిరాయింపుల విషయంలో తప్పకుండా నా పరిధిలో మిగితా 2వ పేజీలో

# బంగ్లాదేశ్‌లో కర్ఫ్యూ..



- **105కు చేరిన మృతుల సంఖ్య**

**బలగంటీవీ, న్యూఢిల్లీ**

ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ అంశంపై బంగ్లాదేశ్‌లో యువత ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా అల్లర్లు చోటుచేసుకుంటున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించారు. విద్యార్థి నిరసనకారులకు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణల్లో ఇప్పటి వరకు 105 మంది మరణించారు. మరో వైపు బంగ్లాదేశ్‌లో ఉన్న 245 మంది భారతీయ పౌరులు స్వదేశం తిరిగి వచ్చారు. బంగ్లాలో గత మూడు వారాల నుంచి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. శాంతియుత పరిష్కారం కోసం విద్యార్థులు ప్రభుత్వంతో చర్చలు నిర్వహించాలని ప్రధాని షేక్ హసీనా తెలిపారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం కోసం 1971లో జరిగిన యుద్ధంలో మరణించిన వారి వారసులకు ప్రభుత్వ ఉద్యోగ రిజర్వేషన్‌లలో 30 శాతం కోటా కల్పిస్తున్నారు. అయితే ఇప్పటికైనా ఈ పద్ధతిని మార్చి ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వాలని అక్కడి వర్సిటీల విద్యార్థులు, ప్రజలు కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆందోళనకారులు బుధవారం రెండు బస్సులకు నిప్పు పెట్టారు. ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో పోలీసులు రబ్బరు బులెట్లు, మిగితా 2వ పేజీలో

# రేపటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

- ఎల్లుండి కేంద్ర బడ్జెట్
- కొన్ని కీలక బిల్లుల ఆమోదానికి రంగం



**బలగంటీవీ, న్యూఢిల్లీ**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కాగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతారు. సోమవారం పార్లమెంట్‌లో ఆర్థిక సర్వే వెలువడుతుంది. ఈసారి పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఇండియా కూటమి సంఘటితంగా ఉండటం, రాహుల్ గాంధీ సభలో ప్రతిపక్ష నేత కావడం వంటి పరిణామాలతో ఈ వర్షాకాల సెషన్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటుందని భావిస్తున్నారు. నీట్ పరీక్షా పత్రాల లీక్ కేసు, రైల్వే భద్రత వంటి పలు విషయాలపై ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున నిలదీసే అవకాశం ఉంది. సోమవారం ఆరంభమయ్యే సెషన్ మొత్తం 19 సిట్టింగ్‌లుగా ఆగస్టు 12వ తేదీవరకూ సాగుతుంది.

**ఆరు బిల్లులు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం**

ఈసారి సమావేశాలలో మోడీ ప్రభుత్వం మొత్తం ఆరు బిల్లులను ప్రవేశపెట్టనుంది. వీటిలో నూతన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్. దీనిమేరకు దేశంలో 90 సంవత్సరాల నాటి విమానాల యాక్ట్‌కు ప్రత్యామ్నాయ చట్టం అమలులోకి రానుంది. జమ్మూ కశ్మీర్ బడ్జెట్‌కు ఆమోదం కూడా జరగాల్సి ఉంటుంది. అక్కడ కేంద్ర పాలన అమలులో ఉంది. బడ్జెట్‌కు ముందు దేశంలోని ఆర్థిక పరిస్థితిని విశ్లేషించే ఎకనామిక్ సర్వే సోమవారం సభ ముందుకు వస్తుంది. ఇది బడ్జెట్ స్వరూపానికి ప్రతీక అవుతుంది. కాగా పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజూ పార్లమెంట్‌లోని రాజకీయ పార్టీల సభాపక్ష నేతలతో సమావేశం నిర్వహించారు. సభలు సజావుగా సాగేందుకు వారి సహకారం అభ్యర్థించారు. విపక్షాల నుంచి ప్రస్తావనకు వచ్చే సమస్యల గురించి ఆరాతీశారు. ప్రతిపక్షాలకు తగు విధంగా అవకాశం కల్పించడం జరుగుతుందని వివరించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే ఒడిషాలోని మాజీ సిఎం సీనియర్ నేత నవీన్ పట్నాయక్‌కు చెందిన బీజేడీ ఈసారి తాము బలీయ ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని తెలిపింది ఇటీవలే పట్నాయక్ బిజెడి పార్లమెంటరీ పార్టీ నేతగా నవీన్ పట్నాయక్ ఎన్నికయ్యారు. ఒడిషా రాష్ట్ర ప్రయోజనాలకోసం సభలలో తమ పార్టీ బలీయంగా నినదిస్తుందని నవీన్ తెలిపారు.

ఇక ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను 51 శాతం కన్నా తక్కువకు తీసుకువస్తే సహించేది లేదని, పార్లమెంట్‌లో నిలదీస్తుందని ఛైర్‌పర్సన్ హోదాలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ తెలిపారు. ఈ సారి సెషన్‌లో మిగితా 2వ పేజీలో

# అప్పు అడిగినందుకు మహిళ హత్య

- ముత్తారంలో ఇంట్లో చంపి గొనసంచిలో
- మూటకట్టి బావిలో వేసిన వైనం
- ముగ్గురు అరెస్ట్



**బలగం టీవీ, పెద్దపల్లి:**
పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో గత నెల 8వ తేదీన బావిలో మూటలో దొరికిన మహిళను అప్పు అడిగినందుకే హత్య చేశారని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ తెలిపారు. మంథని పోలీస్ స్టేషన్ లో శనివారం సమావేశంలో మంథని సీఐ వెంకటేశ్వర్లు, ముత్తారం ఎస్ఐ మధుసూధన్ రావులతో కలిసి నిందితుల వివరాలను తెలిపారు. ఈ నెల 5వ తేదీన ముత్తారంకు చెందిన అమ్ము రజీత అలియస్ లావాణ్య తన ఇంటి సమీపంలో ని పెరక రాజేశ్వరి (65) వద్ద రూ. లక్ష 50 వేలు అప్పు తీసుకుంది. రాజేశ్వరి తరుచూ అప్పుడబ్బులు ఇవ్వమని అడిగినందుకు ఆగ్రహంతో 8వ తేదీన అప్పు ఇస్తానని రాజేశ్వరిని ఇంటికి పిలిచిన లావణ్య మరో వ్యక్తి కుక్కముడి తిరుపతితో పాటు భర్త రవి అలియాస్ రమేష్‌తో కలిసి ఆమెను ఇంట్లో గొంతు నులిమి చంపారు. అదే రాత్రి గొనసంచిలో మూటకట్టి బావిలో పారుపల్లికి వేళ్లే వ్యవసాయ బావిలో వేశారన్నారు. హత్యలో పాల్గొన్న ముగ్గురిని శనివారం ఉదయం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మధుసూధన్ రావు లు అరెస్ట్ చేశారని తెలిపారు. అప్పు ఇచ్చిన రాజేశ్వరి తమను తరచుగా డబ్బులు ఇవ్వాలని ఇబ్బందులు పెట్టేదని, అందుకే ఆమెను హత్య చేసి రాజేశ్వరి ఒంటి పై ఉన్న బంగారం తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందుతులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చమన్నారు. హత్య చేసిన నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ, ఎస్ఐ లతో పాటు కానిస్టేబుల్స్ దుబాసి రమేష్, బాలగాని కిరణ్ లను ఏసీపీ అభినందించారు.

# బంగ్లాదేశ్‌లో కర్ఫ్యూ..




(మొదటి పేజీ తరువాయి)
టియర్ గ్యాస్ ప్రయోగించారు. కొన్నిచోట్ల అధికార అవామీ లీగ్ విద్యార్థి సంఘం నాయకులు.. ఆందోళనకారులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఘర్షణలు జరిగాయి. గురువారం రాంపురా ప్రాంతంలోని టెలివిజన్ భవన్‌లో మీడియా ప్రతినిధులతో సహా చాలామంది చిక్కుకుపోయారు.

# నిరుద్యోగులపై ప్రభుత్వం కక్ష కట్టింది

(మొదటి పేజీ తరువాయి)
ఉన్నంత వరకు న్యాయం చేస్తానని గవర్నర్ చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు.

**రాష్ట్రపతిని కూడా కలిసి చెబుతాం..**
ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రోటోకాల్ విషయం లో జరుగుతన్న అగౌరవాన్ని కూడా వివరించాం. ఈ విషయంలో ప్రభుత్వానికి లేఖ రాస్తానని గవర్నర్ చెప్పారు. ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం వాటిల్లకుండా చూస్తానని చెప్పారు. భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని గవర్నర్ చెప్పారన్నారు.
ఇక్కడితో ఆగకుండా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండే పెద్దలను కలిసి కాంగ్రెస్ పార్టీ నిర్వాకాన్ని వివరిస్తాం. రాష్ట్రపతిని కూడా కలిసి చెబుతాం. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే వరకు, గ్రూప్–2, 3 పోస్టులు పెంచేదాకా, నిరుద్యోగులకు న్యాయ ం జరిగేదాకా ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని, నిరుద్యోగులకు అండగా ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోండి..



- బీజేపీ నాయకుల దీక్ష

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**
సిరిసిల్ల వస్త్ర పరిశ్రమంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సిరిసిల్ల పట్టణంలో బీజేపీ నాయకులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉంది అని,ఈ సంక్షోభానికి బతుకమ్మ చీరాల బకాయిలు ఇవ్వకపోవడం ఏంటని అన్నారు.వస్త్ర పరిశ్రమలో ఉపాధి లేక కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారు అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఉచిత విద్యుత్తు వెంటనే అమలు చేయాలి వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఉపాధి కల్పించాల అని,ఆత్మహత్య చేసుకున్న కార్మికులకు ప్రభుత్వం వెంటనే తక్షణ పరిహారం చెల్లించాలని అన్నారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభం నుండి బయటపడాలంటే ఉచిత విద్యుత్ ఇవ్వాలని, 10% యారన్ సబ్సిడీ వర్కర్ టు ఓనర్ పథకాన్ని,బతుకమ్మ చీరల బకాయిలు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కొత్త ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులకి సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం, కాటన్ ఉత్పత్తిదారుల సంఘం, ఆసాముల సంఘం మరియు డయింగ్ ఆసాముల సంఘం సంఘీభావం తెలిపినారు.ఈ దీక్షా కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ పార్లమెంట్ కో కన్వీనర్ ఆడెపు రవీందర్, కొండ నరేష్, గాజుల సదానందం కోడం ఆనంద్ బాబు, మోర రవి, మెరుగు శ్రీనివాస్, కోడం రవి, కోడం శ్రీనివాస్, సుంచు ప్రకాష్, తౌటు రాజలింగం, వడ్నాల శ్రీకాంత్, వేముల రజనీకాంత్, దీక్షా కార్యక్రమాన్ని ప్రారంభించిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, గాజుల వేణు, దుమాల శ్రీకాంత్ గారు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు మరియు బిజెపి నాయకులు, కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు..

# అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

- దున్నేవాడికే రైతు భరోసా...
- రైతన్నకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం.
- మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే..




**బలగం టీవీ,గంభీరావుపేట**
రైతు వర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకపోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని, దానిలో భాగంగా ఒకేసారి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీనివాస్ అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సన్మాన సభకు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతోనే ఈ స్థానంలో ఉన్నానని, అందరూ కలిసి గెలిపించడంతోనే ఈరోజు ఎమ్మెల్యే అయ్యానని, అందరికీ చేదోడు వాదోడుగా ఉంటూ వారి అభివృద్ధికి సహకారం అందజేస్తానని అన్నారు. మున్నూరు కాపులు వ్యవసాయం ఆధారంగా జీవనం సాగిస్తున్నారని, గ్రామాల్లో వారికి ఇతర కులాలతో సత్సంబంధాలు ఉంటాయని అన్నారు.అన్ని కులాల వారికి విద్య ముఖ్యమని,మున్నూరు కాపులు కూడా విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. మున్నూరు కాపులు ఆర్థికంగా రాజకీయంగా మరియు వ్యాపారంగా ఎదగడానికి సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మున్నూరు కార్పొరేషన్ బాధ్యత తీసుకున్నానని, కార్పొరేషన్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారని అన్నారు. మున్నూరు కాపు కార్పొరేషన్ తో పాటు 16 కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దేనిని అన్నారు. త్వరలో కార్పోరేషన్లకు చైర్మన్లను సభ్యులను ప్రభుత్వం నియమిస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేదలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా, రైతును రాజును చేయడమే లక్ష్యంగా అనేక రకాలుగా సంకల్పంతో అనేక కార్యక్రమాలు చేస్తున్నాడని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ చేయడం సాహసోపేత నిర్ణయమని, రైతులు ఆర్థికంగా ఎదగడానికి ఉపయోగపడుతుందని అన్నారు. రుణమాఫీ అయిన రైతులు మళ్లీ లోన్లు తీసుకోవచ్చని,పాసుబుక్ ఉండి లోను తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ అవుతుందని అన్నారు. పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 28 వేల కోట్లు రుణమాఫీ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలల కాలంలోనే 31 వేల కోట్ల రూపాయలు రుణ మాఫీ చేసిందని అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అవుతుందని, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు బొప్పా దేవయ్య, మండల అధ్యక్షుడు కూర సూరేష్, రాష్ట్ర నాయకులు కొమిరిశెట్టి తిరుపతి, ధూమాల శ్రీకాంత్, గడ్డం నర్సయ్య, జిల్లా నాయకులు అగ్గి రాములు, గంట అశోక్, మండల యువజన విభాగం అధ్యక్షుడు కిరణ్ కుమార్, నాయకులు గంట శ్రీనివాస్, నంది కిషన్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కే కే మహేందర్ రెడ్డి, బుస రాజు మున్నూరు కాపు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి)
బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1949కు ఇతర చట్టాలైన బ్యాంకింగ్ కంపెనీల యాక్ట్‌లకు కూడా సవరణలు చేపట్టాలని మోడీ ప్రభుత్వం భావిస్తోంది. ఫైనాన్స్ బిల్లు కాకుండా ఈ సారి ప్రభుత్వం విపత్తు నిర్వహణ బిల్లును కూడా లిస్ట్‌లో పెట్టింది. దీనిని ఆమోదింపచేసేందుకు ప్రయత్నించే క్రమంలో పాట్లు పడాల్సి ఉంటుంది. పార్లమెంటరీ ఏజెండాను ఖరారు చేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సభా నిర్వహణల సలహా కమిటీ (బిఎసి)ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి స్పీకర్ అధ్యక్షత వహిస్తారు. కమిటిలో పలు పార్టీలకు చెందిన ఎంపిలు సభ్యులుగా ఉన్నారు.

# పాఠశాలల వేళల్లో మార్పు



- తెలంగాణ విద్యాశాఖ ఉత్తర్వులు
- అరగంట ముందుకు జరిపిన తెలంగాణ విద్యాశాఖ
- హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో పాత పనివేళలే

**బలగంటీవీ- హైదరాబాద్ బ్యూరో**
పాఠశాలల వేళలను మారుస్తూ తెలంగాణ విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక పాఠశాలల సమయానికి అనుగుణంగా ఉన్నత పాఠశాలల్లో సమయాలను మార్పు చేసింది. ఉన్నత పాఠశాల సమయాన్ని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు మారుస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 వరకు పని వేళలు ఉండేవి. ఇప్పుడు ఉదయం అరగంట సమయాన్ని ముందుకు జరిపి, సాయంత్రం కూడా ముందుకు జరిపింది.అయితే, హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే అమలులో ఉన్న పని వేళలు కొనసాగుతాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక్కడ పాఠశాలలు ఉదయం 8.45 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనున్నాయి.



## సైబర్ నేరాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**
ఆన్–లైన్ అండ్ మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరుతో మోసాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని,తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలు అంటూ మోసపూరిత ప్రచారాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,ఈజీ మనీ ఆశలో పడి మోసపూరితమైన యాప్ లలో అత్యాశకు పోయి డబ్బులు పెట్టి మోసపోవద్దు అని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఓ ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ కొన్ని గంటల్లో, ఒక రోజులోనే, వారం రోజుల్లోనే రెట్టింపు నగదు ఇస్తానంటూ,ఆన్లైన్ ట్రేడింగ్ లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటు,ఆశావహులకు సైబర్ నేరగాళ్లు యెర వేస్తున్నారని,ఆన్లైన్ ట్రేడింగ్, గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో అమాయక ప్రజలకు కుచ్చుటోపీ పెడుతున్నారని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.
స్టూడెంట్స్, రిటైర్డ్ ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలను టార్గెట్ చేస్తూ ఆకట్టుకునే ప్రకటనలతో నమ్మిస్తూ కంపెనీలో పెట్టుబడి పెట్టిన ఏడాదికే రెట్టింపు అవుతుందని, తమ కంపెనీ మెంబర్ గా జాయిన్ అయ్యి వాటిని అమితే లక్షలు సంపాదించుకోవచ్చని మాయమాటలు చెప్పి,ప్రొడక్ట్స్ తో పాటు ఎడ్యుకేషన్ కు సంబంధించిన మల్టీ లెవల్ మార్కెటింగ్ సెమినార్లు పెట్టి లక్షలాది మందిని బురిడీ కొట్టిస్తున్నారు అని అన్నారు.సైబర్ నేరాలకు గురైతే వెంటనే ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930 తో పాటు, www.cybercrime.gov.in వెబ్ సైట్ లో పిర్యాదు చేయాలని తెలిపారు.

# నేడే బోనాలు




- 1500 మందితో భారీ బందోబస్తు
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

**బలగంటీవీ- హైదరాబాద్ బ్యూరో**
ఆషాఢ మాస బోనాల్లో భాగంగా సికింద్రాబాద్‌లో ఆదివారం ఉజ్జయని మహంకాళి బోనాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు ఆలయ సిబ్బంది. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 21,22 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఉజ్జయిని మహంకాళి ఆలయానికి 2 కిలోమీటర్ల వరకూ ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. లష్కర్ బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతావారణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతిష్టాత్మకమైన సికింద్రాబాద్ ఉజ్జాయినీ అమ్మ వారి ఆలయానికి తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. రెండు రోజులు జరిగే ఉత్సవాల్లో మంత్రులు, వీఐపీలు, వీవీఐపీలు, ప్రముఖులు రానున్న నేపథ్యంలో 1500 మందితో భారీ భద్రతను కట్టుదిట్టం చేశారు.
సికింద్రాబాద్ మహంకాళీ బోనాల నేపథ్యంలో జంటనగరాల్లో పలు ప్రాం తాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ అదనపు పోలీస్ కమిషనర్ విశ్వప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. మహంకాళీ దేవాలయం పరిసరాల తోపాటు జనరల్ బజార్, సుభాష్ రోడ్ మార్గాలను మూసేస్తారు. ఎంజీ రోడ్, సింధికాలనీ, మినిస్టర్ రోడ్, ప్యాట్నీ తదిర ప్రాంతాల్లో 21, 22 తేదీల్లో రెండు రోజులపాటు ఈ మార్గాలో కార్లు, ద్విచక్రవాహ నాలతోపాటు ప్రయివేటు, ఆర్టీసీ బస్సులను దారి మళ్లింపు ఉంటుందన్నారు. సాధారణ వాహన దారులు ప్రత్యామ్నా య మార్గాల్లో వెళ్లాలన్నారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొనే వాహనదారులు కోసం ప్రత్యేకంగా 9 ప్రాంతాలల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామని, పోలీసులు సూచించిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలను పార్క్ చేయాలని కోరారు.

# గైర్హాజరైన టీచర్ ల పై చర్యలు తీసుకోండి...

- విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**
ముందస్తు సమాచారం లేకుండా, సెలవు దరఖాస్తు ఇవ్వకుండా గైర్హాజరైన టీచర్లకు పై చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల జిల్లా విద్య అధికారికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాలు జారీ చేసారు.శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీత నగర్ ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భగా 8,9,10 తరగతుల విద్యార్థులకు ఇంగ్లీషు , గణితం, భౌతిక శాస్త్రాలను బోధించి, విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారిచ్చిన సమాధానాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు గణితం, ఆంగ్లం సబ్జెక్ట్ ల పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధానోపాధ్యాయురాలని ఆదేశించారు.విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, తయారీ విధానమును స్టోర్ రూమ్ లను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనము మెనూ ప్రకారం అందించాలని,స్కూల్ ఆవరణలోని బాలుర టాయిలెట్లను, పరిసరాలను స్వయంగా పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, ఏవైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వాటిని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పాఠశాలలోని ఉపాధ్యాయి నీ, ఉపాధ్యాయుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఇప్పటినుండి 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇప్పటినుండి పదవ తరగతి సిలబస్ పై అవగాహన కల్పించాలని,విద్యార్థుల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, నాణ్యమైన విద్యా బోధన చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన సీఐ సస్పెండ్

**బలగంటీవీ- హైదరాబాద్ బ్యూరో**
ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన సనత్‌నగర్ సీఐపై సస్పెన్షన్ వేటు పడింది. వివరాల్లోకెళ్తే.. సనత్‌నగర్‌లో నివాసముండే ఓ మహిళ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఓ విషయమై ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. ఫిర్యాదు చేసిన అనంతరం మహిళా ఫోన్ నెంబర్ తీసుకున్న ఇన్‌స్పెక్టర్ పురేందర్రెడ్డి ఆమెతో చాటింగ్ మొదలుపెట్టాడు అసభ్యకరమైన మెసేజ్లు పంపించసాగాడు. విసిగిపోయిన బాధిత మహిళ నేరుగా సైబరాబాద్ సీపీకి ఫిర్యాదు చేసి ఇన్‌స్పెక్టర్ పంపిన మేసేజ్‌లను చూపించింది.ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన సీపీ సదరు ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



# నేడు భారత్, యూఏఈ పోరు

- సెమిస్ బెర్త్ లక్ష్యంగా భారత్




**బలగంటీవీ, స్పోర్ట్స్ బ్యూరో**

ఆసియాకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ మరోపోరుకు సిద్ధమైంది. ఆదివారం తమ రెండో మ్యాచ్‌లో యూఏఈతో భారత్ తలపడనుంది. ఇప్పటికే చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై భారీ విజయం సాధించిన భారత్..యూఏఈపై గెలిచి సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకోవాలని చూస్తున్నది. ఇక పాయింట్ల పట్టికలో 2.29 రన్‌రేట్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్న టీమ్‌ఇండియా.. యూఏఈపై గెలిస్తే సెమీస్‌లోకి దాదాపు సెమీస్‌లో అడుగుపెట్టినట్టే. పాక్‌తో మ్యాచ్‌లో దీప్తిశర్మ, స్మృతి మంధాన, రేణుకా సింగ్, షెఫాలీవర్మ మెరుగ్గా రాణించారు. లక్ష్యఛేదనలో వర్మ, మంధాన మెరుగైన శుభారంభం అందించారు. పాక్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ అలవోకగా పరుగులు సాధించారు.

## ఆర్టీసీ బస్సులో వెల్లుల్లి పొట్టు తీసుకుంటూ ...

తెలంగాణ ఆర్టీసీ బస్సులో వెల్లుల్లి పొట్టు తీసుకుంటూ కొందరు మహిళలు ప్రయాణిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది. తెలంగాణలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రభుత్వం కల్పించింది. తాజాగా హన్మకొండ నుంచి సిద్ధిపేటకు వెళుతున్న బస్సులో కొందరు మహిళలు వెల్లుల్లిపాయల పొట్టు తీసుకుంటూ ఉచిత ప్రయాణం చేస్తున్నారు. ఈ వీడియోకు నెటిజన్ల నుంచి విశేష స్పందన వస్తోంది.



# ఇక జర్నలిస్టు ప్రీమియర్ లీగ్’




**బలగంటీవీ, స్పోర్ట్స్ బ్యూరో**

ఇక కేఎస్‌జీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్‌కు వేళైంది. ఈ మేరకు శనివారం జెర్సీల ఆవిష్కరణ వేడుకగా ఘనంగా జరిగింది. శనివారం సికింద్రాబాద్ జింఖానా స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు , చెన్నూర్ ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామి లు ముఖ్య అతిథులుగా హాజరై జెర్సీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ.. క్రీడారంగం అభివృద్ధి, క్రీడాకారుల అభ్యున్నతికి నిత్యం పరితపించే జర్నలిస్టులే ఆటగాళ్లుగా మారిపోయి గ్రౌండ్‌లోకి దిగడం చూస్తుంటే సంతోషంగా ఉందని అన్నారు. ఈ టోర్నీలో తలపడుతున్న అన్ని జట్లకు ఆల్ ద బెస్ట్ తెలిపారు. ఆ తర్వాత ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతారని అన్నాడు. జర్నలిస్టులతో నా అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని.. పాత్రికేయులు నాకు మిత్రులుకాదు.. కుటుంబ సభ్యులు వంటి వారు అన్నారు.జేపీఎల్ విజయవంతం కావాలని కోరుకుంటున్నా అని వివేక్ తెలిపారు. జేపీఎల్ ఇతర లీగ్‌లకు ఒక ట్రెండ్‌సెట్టర్‌గా నిలవాలని, జర్నలిస్టులు అద్భుతంగా ఆడి, అందరికి ప్రేరణగా నిలవాలని భరత్ రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో త్రుక్ష ఫుడ్స్ ఎండీ భరత్ రెడ్డి, లైఫ్ స్పాన్ సంస్థ స్పోర్ట్స్ హెడ్ భరణి, కేఎస్‌జీ సీఈఓ సంజయ్, హెచ్‌సీఏ సీనియర్ సభ్యులు ఆగంరావు, స్మయిల్‌గార్డ్ ఫౌండర్ శరత్, జూపర్ ఎల్ఈడీ ఫౌండర్ రమేష్‌లతో పాటు పది మీడియా సంస్థల జట్లు పాల్గొన్నాయి

## నేను రాంగ్ టైమ్‌లో ఔటయ్యాను



**బలగంటీవీ, స్పోర్ట్స్ బ్యూరో**

సౌతాఫ్రికాతో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో తాను రాంగ్ టైమ్‌లో ఔటై ఘోర తప్పిదం చేశానని టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ అన్నాడు. ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత్ 7 పరుగుల తేడాతో గెలిచి 11 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ విజయంపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన అక్షర్ పటేల్ మాట్లాడుతూ ఆ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో రాంగ్ టైమ్‌లో ఔటయ్యానని తెలిపాడు. బౌలింగ్‌లో ధారళంగా పరుగులుచ్చినా కెప్టెన్ రోహిత్ శర్మ అండగా నిలిచాడని గుర్తు చేసుకున్నాడు.

“అది నేను చేసిన ఘోర తప్పిదం. నేను ఆ సమయంలో అప్రమత్తంగా లేను. దాంతో కీలక సమయంలో ఔటవ్వడంతో నాపై నాకే కోపం వచ్చింది. నేను హిట్టింగ్ చేయగా.. మరో ఎండ్‌లో ఉన్న విరాట్ కోహ్లీ ఆచితూచి ఆడాడు. దూకుడుగా ఆడి మూడు ఓవర్లలో ఎక్కువ పరుగులు చేయాలనుకున్నాం. ఈ క్రమంలోనే వికెట్ కోల్పోయా. హెన్రిచ్ క్లాసెన్ ధాటికి ఒకే ఓవర్‌లో 24 పరుగులిచ్చుకున్నాను. ఆ ఓవర్ పూర్తయిన తర్వాత ఐదు సెకన్లపాటు ఏం అర్థం కాలేదు. దాంతో ఎంతో నిరుత్సాహానికి గురయ్యాను. ఈ మ్యాచ్‌లో ఓటమి ఖాయం అనుకున్నాం. కానీ తిరిగి పుంజుకుంటామని నా అంతరాత్మ చెప్పింది. అప్పుడు రోహిత్ శర్మ నా దగ్గరకు వచ్చి.. నా భుజం తట్టాడు. బాగా బౌలింగ్ చేశావని మెచ్చుకున్నాడు” అని వివరించాడు.




# నారాయణమూర్తి డిశ్చార్జి



**బలగంటీవీ, సినిమా బ్యూరో**

టాలీవుడ్ ప్రముఖ నటుడు, దర్శకనిర్మాత ఆర్ నారాయణమూర్తి హాస్పిటల్ నుంచి శనివారం డిశ్చార్జి అయ్యారు. ఒంట్లో నలతగా ఉండడంతో ఆయన నాలుగు రోజుల కిందట హైదరాబాద్ నిమ్స్‌లో అడ్మిట్ అయ్యారు. కాగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుటపడడం వల్ల ఇవాళ డిశ్చార్జి అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనకు వైద్యం అందించిన డాక్టర్, హాస్పిటర్ స్టాఫ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.‘దేవుడు దయవల్ల నేను ఆరోగ్యంగా ఉన్నాను. నాకు వైద్యం అందించిన డాక్టర్లకు, నా అభిమానులకు ధన్యవాదాలు’ అని ఆయన పేర్కొన్నారు.

# దళిత యువకుడిపై దాడి



**బలగంటీవీ, న్యూఢిల్లీ**

తలపాగా, కళ్లజోడు ధరించి కళ్లజోడు పెట్టుకుని దిగిన ఫొటోను తన ఇన్‌స్టాలో షేర్ చేశాడన్న ఆగ్రహంతో ఒక దళిత యువకుడిని కొందరు అగ్రవర్ణాల వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన గుజరాత్‌లో సబర్‌కాంత జిల్లా సయేబాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఆటో రిక్షా నడుపుకుని జీవించే అజయ్ పర్‌మార్ అనే దళిత యువకుడిని నలుగురు వ్యక్తులు తీవ్రంగా కొట్టారు. ఓ సామాజిక వర్గం వారే అలాంటి తలపాగా, కళ్లజోడు ధరించాలి. వాటిని పెట్టుకోవడమే కాక ఫొటో తీసి అప్‌లోడ్ చేయడానికి నీకెంత ధైర్యం’ అంటూ తనను చితకబాదారని బాధితుడు వాపోయాడు. దీంతో నలుగురిపై కేసు నమోదు చేశామని, అయితే నిందితులు పరారీలో ఉన్నారని హిమత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ తెలిపారు.

# సరిపోదా శనివారం నుంచి మరో గ్లింప్స్

**బలగంటీవీ, సినిమా బ్యూరో**

నేచురల్ స్టార్ నాని- వివేక్ ఆత్రేయ కాంబోలో వస్తున్న చిత్రం ‘సరిపోదా శనివారం’. ఈ సినిమా నుంచి ఇప్పటికే వచ్చిశ్రీ మొదటి గ్లింప్స్, సాంగ్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. గతంలో వివేక్ ఆత్రేయతో నాని చేసిన ‘అంటే సుందరానికి’ సినిమా మంచి సక్సెస్ అందుకుంది. ఇక ఈ సినిమాలో తమిళ డైరెక్టర్, నటుడు ఎస్‌జే సూర్య విలన్ రోల్‌లో నటిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఎస్‌జే సూర్య పుట్టినరోజు కావడంతో మూవీ టీమ్ ఆయన పాత్రను పరిచయం చేస్తూ స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేసింది. ఇందులో మరోసారి తన నటనతో భయపెట్టారు సూర్య.

మొదటి గ్లింప్స్‌లో హీరో పాత్రను పరిచయం చేసిన టీమ్ తాజా వీడియోలో విలన్ రోల్‌ను ప్రేక్షకులకి పరిచయం చేశారు. అయితే వెరైటీగా హిందీ డైలాగ్స్‌తో ఈ గ్లింప్స్ మొదలైంది. పోలీస్ పాత్రలో ఎస్‌జే సూర్య చాలా వైలెంట్‌గా కనిపించారు. ప్రజలను ఇబ్బంది పెడుతూ రాక్షాసానందం పొందే నరాకాసురుడి లాంటి పోలీస్‌ను సత్యభామ (హీరోయిన్) సాయంతో కృష్ణుడు (నాని) వధించడమే ఈ స్టోరీ అంటూ సింపుల్‌గా గ్లింప్స్‌లో చెప్పేశారు. నాని- ప్రియాంక మోహన్ జంటగా నటిస్తున్న ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఆగస్ట్ 29న విడుదల కానుంది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి.. ‘సరిపోదా శనివారం’ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జేక్స్ బిజోయ్ మ్యూజిక్ అందిస్తున్నారు. గతంలో ప్రియాంక-నాని కాంబోలో వచ్చిన గ్యాంగ్ లీడర్ చిత్రం కూడా సూపర్ హిట్ అయింది.




# డైనోసార్ అస్థిపంజరానికి రూ.373 కోట్లు..!



**బలగంటీవీ, అంతర్జాతీయం**

అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ‘సిటాడెల్’ వ్యవస్థాపకుడు, సీఈవో కెన్ గ్రిఫిన్ సుమారు రూ.373 కోట్లతో (44.6 మిలియన్ డాలర్లు) ఓ డైనోసార్ అస్థిపంజరాన్ని కొనుగోలు చేశారు. వేలం రికార్డులను బద్దలు కొడుతూ ఆయన ఈ డైనోసర్ అస్థిపంజరాన్ని దక్కించుకున్నారని ‘న్యూయార్క్ పోస్ట్’ కథనం పేర్కొంది. ‘సోథెబైస్’ అనే వేలం నిర్వహణ సంస్థ న్యూయార్క్‌లో బుధవారం నిర్వహించిన వేలంలో దీనిని దక్కించుకున్నారని తెలిపింది. కాగా ఆయన కొనుగోలు చేసిన డైనోసార్ అస్థిపంజరం అతి పెద్దదని, చెక్కుచెదరనిదని వివరించింది. వేలం చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక ధరకు అమ్ముడుపోయిన శిలాజ వస్తువు ఇదేనని తెలిపింది. కాగా ఈ డైనోసార్ అస్థిపంజరం దాదాపు 150 మిలియన్ సంవత్సరాల పురాతనమైనదని అంచనా వేస్తున్నారు. ఈ భారీ అస్థిపంజరానికి ‘అపెక్స్’ అని పేరుపెట్టారు. కొలరాడోలోని డైనోసార్ అనే ప్రాంతానికి వెలుపల మే 2022లో తవ్వకాల చేపట్టిన పాలియోంటాలజిస్ట్ జాసన్ కూపర్ దీనిని గుర్తించారు. ఇప్పటివరకు కనుగొన్న డైనోసార్ అస్థిపంజరాల్లో ‘అపెక్స్’ అతి పెద్దదని వేలం నిర్వహణ సంస్థ ‘సోథెబైస్’ పేర్కొంది. దీని ఎత్తు 11 అడుగుల (3.3 మీటర్లు), 27 అడుగుల (8.2 మీటర్లు) పొడవు ఉందని తెలిపింది. మొత్తం 319 ఎముకలు ఉంటాయని అంచనా వేయగా అందులో 254 ఎముకలు చెక్కుచెదరకుండా ఉన్నాయని తెలిపింది.

కాగా ‘అపెక్స్’ను దక్కించుకునేందుకు ఏకంగా ఆరుగురు పోటీపడ్డారు. 15 నిమిషాల పాటు వేలంపాట జరిగింది. కెన్ గ్రిఫిన్ అందరినీ అధిగమించి ఈ అస్థిపంజరాన్ని దక్కించుకున్నారు. నిజానికి ఈ అస్థిపంజరం 6 మిలియన డాలర్ల వరకు అమ్ముడుపోతుందని అంచనా వేశారు. కానీ ఏకంగా 44.6 మిలియన డాలర్లు పలకడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంచనా కంటే 11 రెట్లు అధిక ధర పలకడంతో రికార్డులు కూడా బద్దలయ్యాయి. కాగా ఫోర్బ్స్ ప్రకారం కెన్ గ్రిఫిన్ సంపద సుమారు 37.8 బిలియన్ డాలర్లు ఉంటుందని అంచనాగా ఉంది. ఆయన రిపబ్లికన్ పార్టీకి రెగ్యులర్‌గా డొనేట్ చేస్తుంటారని పేర్కొంది.